


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 117 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం సోమవారం 9 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 117 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM MON 9 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్...

# నేనే అంబాసిడర్‌గా ఉంటా

- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- అమరావతిలో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రకటన
- డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ



**పెన్ పవర్ డెస్క్:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. సభకు భారీగా తరలివచ్చిన మహిళలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. తాను, ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముగ్గురం కలిసి మహిళల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సృష్టికి మూలం మహిళ అని, ప్రేమ, త్యాగం, కష్టానికి వారు ప్రతిరూపమని కొనియాడారు. తెలుగింటి ఆడబిడ్డలకు, దేశంలోని మహిళలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంగానే కాకుండా ఒక అన్నగా, తండ్రిగా ఆడబిడ్డలను ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు తీసుకురావడానికి తన సర్వశక్తులూ ఒడ్డుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2019-24 మధ్య కాలంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, దానివల్ల తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి పేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, డ్వాక్రా, మెప్మా సంఘాలకు పూర్వ వైభవం తీసుకురావడమే తమ ఆలోచన అని పునరుద్ఘాటించారు. మహిళలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన అన్నారు. "మా ఆడబిడ్డలు తయారుచేసే వస్తువులకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వయం' బ్రాండ్‌ను ప్రారంభించాం. ఈ బ్రాండ్‌కు నేనే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉంటాను. నాణ్యత, ప్యాకేజింగ్, టెక్నాలజీ వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 84 లక్షల మందికి పైగా డ్వాక్రా సభ్యులున్నారు. వారందరినీ ఆర్థికంగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే మా సంకల్పం" అని వివరించారు.

ఇప్పటికే లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారని, రాబోయే ఏడాదిలో మరో 5 లక్షల మందిని చేర్చి మొత్తం 6 లక్షల మందితో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహిళలు తయారు చేసే వస్తువులను వారే వినియోగించుకుంటే దాదాపు మూడున్నర కోట్ల మంది వినియోగదారులు ఏర్పడతారని, ఇది మార్కెటింగ్‌కు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన పలువురు మహిళా ప్రముఖులను ప్రశంసించారు. దేశానికి రాష్ట్రపతిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్ము, ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని అన్నారు. వచ్చిన ఆదాయాన్ని సమర్థంగా వినియోగించి కుటుంబాన్ని నడిపే మహిళలే నిజమైన ఆర్థిక మంత్రులని చంద్రబాబు అభివర్ణించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కూడా ప్రధాన న్యాయమూర్తిగా ఒక మహిళ రాబోతున్నారని తెలపడం సంతోషంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుంటూ, ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించి చట్టం చేసిన ఘనత ఆయనదేనని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టింది,

మిగతా 2లో




## ఇళ్లలోంచి బయటికి రావొద్దు...

### ఇరాన్ ప్రజలకు అమెరికా హెచ్చరిక

- జనావాసాల మధ్య నుంచే క్షిపణుల ప్రయోగిస్తున్న ఇరాన్ సైన్యం
- ఇళ్ల నుంచి బయటకు రావొద్దంటూ ఇరాన్ పౌరులకు అమెరికా సూచన
- పౌరులను ఇరాన్ ప్రభుత్వం ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపణ
- ఇప్పటికే స్వదేశానికి చేరిన 32 వేల మంది అమెరికన్లు
- సైనిక చర్యలు జరిగే చోట భద్రతకు గ్యారంటీ లేదన్న అమెరికా

మిగతా 2లో



## చంద్రబాబు సమక్షంలో సెర్ప్, మెప్మా 36 కీలక ఒప్పందాలు

- వేర్వేరు సంస్థలతో మెప్మా, సెర్ప్ ఒప్పందాలు
- నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం
- చంద్రబాబు సమక్షంలో 36 కీలక ఒప్పందాలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వేర్వేరు సంస్థలతో పట్టణ ప్రాంతాల పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సముద్రపు నాచుతో ఉత్పత్తుల తయారీకి 500 మంది మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా వివిధ సంస్థలతో సెర్ప్, మెప్మా ఒప్పందాలు చేసుకున్నాయి. చంద్రబాబునాయుడు సమక్షంలో 36 కీలక ఒప్పందాలు చేసుకున్నాయి.

**కుదిరిన ఒప్పందాలు ఇవీ**

పట్టణ ప్రాంతాల్లో 260 ఎగ్ కార్ట్స్ సహా మహిళలతో మైక్రో ఎంటర్ ప్రైజెస్ ఏర్పాటు

మిగతా 2లో



## కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

- అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా నాటి యూపీఏ ఓటు వేసిందన్న రామచందర్ రావు
- యూపీఏ ఆరోజు తీసుకున్న నిర్ణయం ఇరుదేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసిందని ఆగ్రహం
- గ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టీకరణ
- ఇంధనం, గ్యాస్ నిల్వలు మన వద్ద ఉన్నాయని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**2005లో యూపీఏ ప్రభుత్వం ఇంటర్నేష నల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిందని, దీనితో 2012లో మనకు ఇరాన్ ఆయిల్ సరఫరా నిలిపివేసింది

మిగతా 2లో

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి...

# అమెరికా ముందే హెచ్చరించిందా?

- వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని అమెరికా హెచ్చరించినట్లు వార్తలు
- నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ చేసి వెల్లడించడంతో వెలుగులోకి..
- కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్లను ఆశ్రయించిన కొంతమంది నావికులు



శ్రీలంక దక్షిణ తీరంలో ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనాపై దాడికి ముందు అమెరికా హెచ్చరికలు జారీ చేసిందా? అంటే అవుననే అంటున్నారు. గత నెలలో విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన ఇరాన్ యుద్ధ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా జలాంతర్గామి దాడి చేసి ముంచివేసింది. అయితే దాడికి ముందు నౌకలోని సిబ్బందిని అమెరికా హెచ్చరించినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో



## న్యూయార్క్ మేయర్ మమ్దానీ ఇంటి వద్ద బాంబుల కలకలం...

# ఆరుగురి అరెస్ట్

- న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం
- నిరసనల్లో స్క్రూలు, బోల్టులతో నింపిన పేలుడు పదార్థాల వినియోగం
- మమ్దానీ ఇంటిపై దాడికి యత్నం.. ఆరుగురు ఆందోళనకారుల అరెస్ట్
- ఆందోళన సమయానికి ఇంట్లో లేని మేయర్ దంపతులు
- ఘటనను ఇస్లామోఫోబిక్ చర్యగా ఖండించిన మేయర్ కార్యాలయం

మిగతా 2లో



## నారీశక్తి వట్టిమాటే... మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను మోసం చేశాయన్న షర్మిల
- సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు నయవంచనకు పాల్పడ్డారని ఆరోపణ
- మహాశక్తి, తల్లికి వందనం పథకాలతో లక్షల మందికి అన్యాయం జరిగిందని విమర్శ
- దేశంలో మహిళలకు భద్రత కరువైందంటూ కేంద్ర ప్రభుత్వంపై ఫైర్
- గ్యాస్, విద్యుత్ ఛార్జీల భారంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ధ్వజం

మిగతా 2లో

## జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

- పాట్నాలోని పార్టీ కార్యాలయంలో నిశాంత్ కుమార్ ను ఘనంగా ఆహ్వానించిన సీనియర్ నేతలు
- తండ్రి మార్గదర్శకత్వంలోనే బీహార్ అభివృద్ధికి పనిచేస్తానని నిశాంత్ వెల్లడి
- త్వరలో చంపారన్ నుంచి రాజకీయ పర్యటనలు ప్రారంభించే అవకాశం

మిగతా 2లో



## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది



- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల బెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్న మాధవ్
- సంతాల్ కాన్ఫరెన్స్‌లో సరైన ప్రోటోకాల్ పాటించలేదని ఆవేదన
- రాజ్యాంగ పదవిని గౌరవించలేదంటూ టీఎంసీపై మండిపాటు
- గిరిజన బిడ్డను అవమానించడం దేశానికే అవమానమని వ్యాఖ్య
- పశ్చిమ బెంగాల్‌లో అరాచక పాలన సాగుతోందని ఆగ్రహం

మిగతా 2లో

ఎడిటర్ వ్యూ

# చంద్రబాబు సమక్షంలో సెర్ప్, మెప్మా 36 కీలక ఒప్పందాలు

కోసం నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీతో ఒప్పందం చేసుకున్న మెప్మా.

ఎస్‌హెచ్‌జీ సంఘాల మహిళలు తీసుకునే రుణాలపై డేటా డ్రివెన్ క్రెడిట్ అసెస్మెంట్ మోడల్స్ తయారీ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో ఒప్పందం.

- మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్, ఆధునిక రీటైల్ కియోస్కుల ఏర్పాటు కోసం రీకనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- మహిళా మైక్రో ఎంటర్ ప్రైజెస్‌లకు ఆహారపదార్థాల కోసం యంత్రపరికరాలను అందించేందుకు కూలెక్స్ ఇండస్ట్రీస్‌తో ఒప్పందం.
- స్వయం ఏపీ ఎంటర్ ప్రైజ్ ఏర్పాటు, మార్కెటింగ్ లింకేజ్ కోసం నిర్మాణ్ ఆర్గనైజేషన్‌తో కుదిరిన ఒప్పందం.
- అరకు కాఫీ, చాయ్ రాస్తా లాంటి అవుట్ లెట్స్ ఏర్పాటు కోసం ఎస్‌హెచ్ జీ మహిళలకు ఆర్థిక సహకారం కోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం.
- ఎస్‌హెచ్ జీ మహిళల కుటుంబాల ఇళ్లనిర్మాణానికి ఆర్థిక సహకారం అందించేలా ఈజీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- తిరుపతి క్యాంటీన్ల నిర్వహణ కోసం స్వయం సహాయ సంఘాల మహిళలకు ఆర్థిక సహకారం అందించేలా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుతో ఒప్పందం.
- మిల్లెట్లతో తయారైన పదార్థాల రీటైల్ అవుట్ లెట్‌ల ఏర్పాటు కోసం 9 నట్జ్ మిల్లెట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- మహిళా సంఘాలు ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేసుకునేలా డిజిటల్ డీపీఆర్‌లు సిద్ధం చేసుకునేలా సహకారం కోసం ఫిన్ వోయిస్ ఓపెన్ బిజినెస్ సొల్యూషన్స్‌తో ఒప్పందం.
- సౌందర్య ఉత్పత్తుల్లో వినియోగించే సముద్రపు నాచు సాగులో స్వయం సహాయ సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీతో ఒప్పందం.
- సీవీడ్ కల్చర్‌లో మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల తయారీ కోసం సీఎస్ఐఆర్‌తోనూ కీలకమైన ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు సీవీడ్ ఉత్పత్తులు, విలువ జోడింపు, శిక్షణ కోసం కేరళకు చెందిన అమృత విశ్వ విద్యాపీఠంతో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- వెలుగు 2.0 ద్వారా ఎస్‌హెచ్‌జీ పారిశ్రామిక వేత్తలను బలోపేతం చేసేలా శిక్షణ, ప్రొఫైలింగ్, మార్కెట్ స్కేల్ అప్ కోసం ఎక్స్‌ఎల్ఆర్ఐ సంస్థతో ఒప్పందం.
- పొదుపు చేసిన మొత్తాలను వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన సహకారం కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో సెర్ప్ ఒప్పందం.
- సర్క్యులర్ ఎకానమీ మోడల్ ద్వారా చేనేత వస్త్రాల జాబ్ వర్క్‌ను విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ అంశాల్లో ఆప్కో మాజిక్ వీవ్స్‌తో ఒప్పందం.
- మహిళా ఎఫ్‌పీఓల బలోపేతం, మార్కెట్ లింకేజి, సహా వివిధ అంశాలపై సహకారం కోసం ఐఐఎం విశాఖపట్నంతో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- దేశీయ పౌల్ట్రీ ఉత్పత్తులు, ప్రకృతి సేద్యం ల్యాండ్ స్కేప్ లాంటి అంశాల్లో సహకారం కోసం వాసన్‌తో ఒప్పందం.
- లైవ్ స్టాక్ వ్యాల్యూ చైన్స్, ఎఫ్‌పీఓలకు సాంకేతిక మద్ధతు అందించేందుకు హైఫెర్ ఇంటర్నేషనల్‌తో కుదిరిన ఒప్పందం.
- ఎఫ్‌పీఓ సర్టిఫికేషన్, గిరిజన ప్రాంతాల్లో మహిళలకు జీవనోపాధి కల్పించే అంశాలకు మద్దతు ఇచ్చేలా విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్‌తో ఒప్పందం.
- మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సహా , క్రెడిట్ రెడీనెస్ కోసం కాల్గుడి డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం.
- మహిళా ఎఫ్‌పీఓలకు ప్రోత్సాహం, ఉత్తరాంధ్రలోని గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం బాపూజీ రూరల్ ఎన్ లైట్మెంట్ డెవలప్మెంట్ సొసైటీతో ఒప్పందం.
- మహిళా రైతులు, ఎఫ్‌పీఓలుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సలహాలను ఇచ్చేందుకు డిజిటల్ గ్రీన్ ట్రస్ట్‌తో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- స్వయం సహాయ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు ఫుడ్ సేఫ్టీ ఆడిట్స్, కెపాసిటీ బిల్డింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ అంశాల్లో హకారం కోసం ఫుడ్ సేఫ్టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో ఒప్పందం.
- ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యంలో నడిచే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సహకారం హ్యాండ్లూమ్ క్లస్టర్ డెవలప్మెంట్ కోసం ఇండియన్ ఎంపోరియంతో ఒప్పందం.
- మహిళా సంఘాల సంస్థలు ఉత్పత్తి చేసిన హ్యాండ్లూమ్ వస్త్రాల ఎగుమతి, మార్కెటింగ్ లింకేజ్ కోసం ఎంబ్యోమ్ కన్సల్టింగ్ సర్వీసెస్‌తో ఒప్పందం.
- మిల్లెట్ క్లస్టర్ల అభివృద్ధి, బ్రాండింగ్ లాంటి అంశాల్లో యాక్సెస్ లైవ్లీ హుడ్స్ కన్సల్టింగ్ ఇండియా లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్న సెర్ప్.
- ఎస్‌హెచ్‌జీ సంస్థలు ఉత్పత్తి చేసిన సుగంధ ద్రవ్యాలు, పచ్చళ్ల తయారీ ఇతర ప్రాసెసింగ్ కోసం నిఎంఎస్‌ఎంఈతో ఒప్పందం.
- స్వయం సహాయ మహిళా సంఘాలకు గ్రామీణ సంస్థల ఏర్పాటు , స్కిల్ డెవలప్మెంట్ లాంటి అంశాల కోసం సెంచూరియన్ యూనివర్సిటి ఆఫ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ తో ఒప్పందం చేసుకున్న మెప్మా.
- 800కు పైగా ఎస్‌హెచ్‌జీలు చాయ్ రస్తా, కాఫీ అవుట్ లెట్‌లను ఏర్పాటు చేసి నిర్వహించేందుకు వీలుగా చాయ్ రాస్తా ఆస్పిరేషనల్ ఫుడ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్న మెప్మా.
- 20 వేల తిరుపతి క్యాంటీన్ అవుట్ లెట్స్‌ను స్వయం సహాయ సంఘాల మహిళలు ఏర్పాటు చేసేలా సారా ప్రాజెక్ట్స్- తిరుపతి క్యాంటీన్స్ సంస్థతో ఒప్పందం.
- కమ్యూటీ హెల్త్ ప్రొఫైలింగ్, ఎస్ హెచ్ జీ మహిళల కుటుంబాలకు హెల్త్ స్క్రీనింగ్ కోసం స్వస్తి ది హెల్త్ కేటలిస్ట్ సంస్థతో ఒప్పందం.
- మొబైల్ డెసెర్ట్ తయారీ ఈవీ వాహనాల నిర్వహణ కోసం ద థిక్ షేక్ ఫ్యాక్టరీ లిమిటెడ్‌తో ఒప్పందం.
- గ్రామీణ మహిళా పారిశ్రామిక వేత్తలు తయారు చేసిన ఉత్పత్తులను స్వయం డిజిటల్ స్టోర్ ఫ్రంట్ ద్వారా మార్కెటింగ్ చేసుకునేందుకు సహకారం అందించేలా ఫ్లిప్ కార్ట్‌తో ఒప్పందం.
- ఎస్‌హెచ్ జీ క్లస్టర్ డెవలప్మెంట్, శిక్షణ, పరిశ్రమలకు ప్రోత్సాహం తదితర అంశాల్లో సాయం అందించేలా ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా తో ఒప్పందం.
- వస్త్రాల తయారీ, శిక్షణ, అరకు కాఫీ ఆన్ వీల్స్ లాంటి వాటిలో సహకారం కోసం ఏపి ఐటీసీఓ సంస్థతో ఒప్పందం.
- స్వయం సహాయ సంఘాల్లోని మహిళల ఆర్థిక స్వావలంబన, శిక్షణ, సహకారం కోసం మొత్తం 36 సంస్థలతో మెప్మా, సెర్ప్ ఒప్పందాలు.
- ఆర్థిక, వ్యవసాయ, సీవీడ్, హ్యాండ్లూమ్, ఫుడ్ సర్వీస్, హెల్త్, డిజిటల్, ఎంఎస్‌ఎంఈ, నైపుణ్య కల్పన తదితర రంగాల్లో కుదిరిన ఒప్పందాలు.
- వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా మహిళా పారిశ్రామిక వేత్తలను తయారు చేసేలా వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం.

# మహిళాభివృద్ధి కోసం 'స్వయం' బ్రాండ్... నేనే అంబాసిడర్‌గా ఉంటా

మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే అని గుర్తుచేశారు. తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాలు, కళాశాలల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించానని, ఆ నిర్ణయం వల్లే నేడు ఐటీ వంటి రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని వివరించారు. భవిష్యత్తులో చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు రాబోతున్నాయని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని రాజకీయాల్లోకి రావడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.మహిళల భద్రత విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏమాత్రం రాజీపడదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే, అదే వారికి చివరి రోజు అవుతుంది. అలాంటి దుర్మార్గులను కఠినంగా హెచ్చరిస్తున్నా. మీ భద్రతకు చంద్రన్న ఉన్నంతవరకు భయపడాల్సిన అవసరం లేదు," అని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్ర హోంమంత్రిగా కూడా ఒక మహిళే (అనిత) ఉన్నారని, ఎక్కడ సమస్య ఎదురైనా తక్షణమే స్పందిస్తారని గుర్తుచేశారు.ఇదే సమయంలో, రాష్ట్రంలో జనాభా తగ్గుదలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఒకప్పుడు 'ఒక బిడ్డ ముద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు వద్దు' అన్నాను. కానీ ఇప్పుడు 'ఒక బిడ్డ వద్దు, ఇద్దరు ఓకే, ముగ్గురు ముద్దు' అని చెబుతున్నాను. రాష్ట్రంలో జననాల రేటు 1.5కి పడిపోయింది. ఇది ప్రమాదకరం. అందుకే పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేందుకు అవసరమైతే మూడు పడకగదుల ఇల్లు, అదనపు రేషన్ వంటి ప్రోత్సాహకాలు అందిస్తాం" అని నూతన విధానాన్ని ప్రకటించారు.

## ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసింది

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పట్ల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరమని, ఇది తీవ్ర ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరిని ఈ సంఘటన కలిచివేసిందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఇంటర్నేషనల్ సంతాల్ కాన్ఫరెన్స్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఆదివారం ఒక ప్రకటనలో స్పందించారు.సంతాల్ సమాజం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేందుకు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో.. అదే సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రపతికి సరైన ప్రాధాన్యత దక్కకపోవడం విచారకరమని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ప్రోటోకాల్ పాటించడంలో, అధికారుల సమన్వయంలో మమతా సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అక్కడి పరిపాలనలోని అరాచక ధోరణిని బయటపెడుతోందని విమర్శించారు.దేశ పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాయడమే కాకుండా, ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతి గౌరవాన్ని కూడా కాపాడలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. గిరిజన సోదర సోదరీమణులు ఎంతో ఆత్మీయంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతిని అవమానించడం అంటే.. అది దేశాన్ని అవమానించడమేనని మాధవ్ అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి ఒక్కరూ ఈ ఘటనను నిరసిస్తున్నారని, ఇలాంటి చర్యలే టీఎంసీ ప్రభుత్వ పతనాన్ని సూచిస్తున్నాయని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

## జేడీయూలో అధికారికంగా చేరిన నితీశ్ కుమార్ తనయుడు

బీహార్ రాజకీయాల్లో ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆదివారం మధ్యాహ్నం పట్నాలోని జేడీయూ కేంద్ర కార్యాలయంలో ఆయన అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి జేడీయూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి లలన్ సింగ్, మంత్రులు విజయ్ కుమార్ చౌదరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ తదితర సీనియర్ నేతలు హాజరయ్యారు.పార్టీలో చేరిన సందర్భంగా సంజయ్ కుమార్ ఝా.. నిశాంత్‌కు పార్టీ టోపీ, జ్ఞాపికను అందించగా, కేంద్ర మంత్రి లలన్ సింగ్ సంప్రదాయ తలపాగా చుట్టి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం సీనియర్ నేతల కాళ్లకు నమస్కరించి నిశాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా నిశాంత్ కుమార్ మాట్లాడుతూ... తన తండ్రి మార్గదర్శకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేశారు. "ఈరోజు నేను పార్టీలో చేరడానికి వచ్చాను. మా నాన్న రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అది ఆయన నిర్ణయం. ఆయన సూచనల మేరకు బీహార్ కోసం మేం పనిచేస్తాం" అని పేర్కొన్నారు. నితీశ్ కుమార్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళతానని చెప్పారు. కార్యకర్తలు పార్టీపై ఇదే ఉత్సాహం, నమ్మకం కొనసాగించాలని కోరారు.కాగా, నిశాంత్ కుమార్ త్వరలోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలతో మమేకమవుతారని జేడీయూ ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ తెలిపారు. చంపారన్ ప్రాంతం నుంచి ఆయన తన రాజకీయ యాత్రను ప్రారంభించే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం. గతంలో నితీశ్ కుమార్ కూడా తన రాజకీయ యాత్రలను అక్కడి నుంచే మొదలుపెట్టేవారు. రాబోయే రోజుల్లో పార్టీ సంస్థాగత బలోపేతంలో నిశాంత్ కీలక పాత్ర పోషిస్తారని, పార్టీ అప్పగించే ఏ బాధ్యతనైనా చిత్తశుద్ధితో నిర్వహిస్తారని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి.

## న్యూయార్క్ మేయర్ మమ్దానీ ఇంటి వద్ద బాంబుల కలకలం... ఆరుగురి అరెస్ట్

న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ నివాసం వెలుపల శనివారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 'యాంటీ ముస్లిం' నిరసన ప్రదర్శనలో ఆందోళనకారులు స్క్రూలు, బోల్టులతో నింపిన 'స్మోకింగ్ ప్రొజెక్టైల్స్' (పొగ వచ్చే పేలుడు వస్తువులు) విసరడం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు.రైట్ వింగ్ యాక్టివిస్ట్ జేక్ లాంగ్ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. సుమారు 20 మంది మద్దతుదారులు అక్కడ చేరగా.. వారికి వ్యతిరేకంగా 100 మందికి పైగా కౌంటర్ ప్రొటెస్టర్లు నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. లాంగ్ మద్దతుదారులు పెప్పర్ స్ప్రే చల్లడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఇరువర్గాలు గుడ్లు విసురుకుంటూ, పిడిగుద్దులతో దాడులు చేసుకున్నాయి.
ఈ గొడవలో ఓ వ్యక్తి పొగలు వెదజల్లే రెండు వస్తువులను జనం మధ్యలోకి విసిరాడు. అవి ఈస్ట్ 87వ వీధిలో పడి మంటలు రావడంతో జనం భయంతో పరుగులు తీశారు. ఇవి టేపుతో చుట్టిన జాడీలని, అందులో నట్లు, బోల్టులు, స్క్రూలు నింపి ఉన్నాయని, అలాగే ఫ్యూజ్ కూడా అమర్చారని పోలీస్ కమిషనర్ జెస్సికా టిష్ తెలిపారు. బాంబ్ స్క్వాడ్ బృందాలు వీటిని పరిశీలిస్తున్నాయి.ఘటన జరిగిన సమయంలో మేయర్ మమ్దానీ, ఆయన భార్య ఇంట్లో లేరని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దాడిని మేయర్ ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. ఇది ముస్లిం వ్యతిరేక చర్య అని, అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పేలుడు వస్తువులు విసిరిన 18 ఏళ్ల ఎమిర్ బాలాట్, అతనికి సహకరించిన 19 ఏళ్ల ఇబ్రహీం నిక్, పెప్పర్ స్ప్రే చల్లిన ఇయాన్ మెక్‌గిన్నిస్‌తో పాటు మొత్తం ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతోంది.

## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి... అమెరికా ముందే హెచ్చరించిందా?

- మొదటి పేజి తరువాయి

వెంటనే నౌకను వదిలిపెట్టి వెళ్లాలని ఇరాన్ యుద్ధ నౌక కమాండర్‌ను రెండుసార్లు ఆదేశించినట్లు తెలుస్తోంది. జలాంతర్గామి దాడికి కొన్ని నిమిషాల ముందు నౌకలోని ఓ సిబ్బంది తన తండ్రికి ఫోన్ ద్వారా తెలియజేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. మార్చి 4న జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని, సిబ్బంది ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచన చేశారని తెలుస్తోంది. అయితే యుద్ధ నౌక కమాండర్ మాత్రం అందుకు ససేమీరా అన్నారు. దీనితో సిబ్బందిలోని కొంతమంది కమాండర్‌తో వాదనకు దిగినట్లు తెలుస్తోంది. కొంతమంది కమాండర్ ఆదేశాలను ధిక్కరించి లైఫ్ బోట్ల ద్వారా ప్రాణాలతో బయటపడ్డారని తెలుస్తోంది. అమెరికా జలాంతర్గామి నుంచి హెచ్చరికలు వచ్చాయని తెలిపిన నౌక సిబ్బంది ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారని తెలుస్తోంది.

## ఇళ్లలోంచి బయటికి రావొద్దు...

ఇరాన్ పౌరులకు అమెరికా సైన్యం ఆదివారం కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ సైన్యం జనావాసాల మధ్య నుంచే డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తున్నందున ప్రజలు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. ఈ వ్యూహం వల్ల లక్షలాది మంది సామాన్యుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, దాడులు తీవ్రమవుతున్న వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది.అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్ కామ్) ప్రకారం.. ఇరాన్ మిలటరీ డెజ్ ఫుల్, ఇస్ఫహాన్, షిరాజ్ వంటి రద్దీగా ఉండే నగరాల నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తోంది. ఇలాంటి ప్రాంతాలను సైనిక అవసరాలకు వాడటం వల్ల అంతర్జాతీయ చట్టాల ప్రకారం అవి రక్షణ హోదాను కోల్పోతాయని, ప్రతీకార దాడులకు గురయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇరాన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అమాయక ప్రజల ప్రాణాలను పణంగా పెడుతోందని సెంట్ కామ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఆరోపించారు. ఇరాన్ తమ పొరుగు దేశాల్లోని పౌర విమానాశ్రయాలు, హోటళ్లపై కూడా విచక్షణారహితంగా దాడులు చేస్తోందన్నారు.తాము పౌరులకు హాని కలగకుండా సాధ్యమైనంత వరకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, అయితే ఇరాన్ సైనిక స్థావరాలుగా వాడుకుంటున్న ప్రాంతాల్లో భద్రతకు గ్యారంటీ ఇవ్వలేమని అమెరికా స్పష్టం చేసింది. ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ వందల కొద్దీ క్షిపణులను ప్రయోగించినప్పటికీ, తమ ప్రతిఘటనతో ఆ వేగం తగ్గిందని పేర్కొంది.మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో మధ్యప్రాచ్యం నుంచి అమెరికన్లను సురక్షితంగా తరలించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు 32,000 మందికి పైగా అమెరికన్లు క్షేమంగా స్వదేశానికి చేరుకున్నారని అసిస్టెంట్ సెక్రటరీ డైలాన్ జాన్సన్ తెలిపారు. ఒమన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల నుంచి ప్రత్యేక విమానాల ద్వారా తరలింపు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## నారీశక్తి వట్టిమాటే... మోదీ, చంద్రబాబుపై షర్మిల ఫైర్

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహిళల భద్రత, సంక్షేమం విషయంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆమె ఆరోపించారు. ఆకర్షణీయమైన పథకాలతో మహిళలను మభ్యపెట్టి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో మహిళలకు ఇచ్చిన మూడు హామీలను విస్మరించి నయవంచనకు పాల్పడిందని షర్మిల విమర్శించారు. 'మహాశక్తి' పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఇస్తామని చెప్పి 1.80 లక్షల మందిని, 'తల్లికి వందనం' కింద 20 లక్షల మంది తల్లులను మోసం చేశారని ఆరోపించారు. వడ్డీ లేని రుణాల హామీతో 1.18 లక్షల డ్వాక్రా మహిళలను వంచించారని అన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒకటి మాత్రమే ఇచ్చారని, ఇప్పుడు గ్యాస్ ధరలు పెంచి వంటింటిపై భారం మోపారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వంపై కూడా షర్మిల విమర్శలు చేశారు. దేశంలో గంటకు 50 మంది మహిళలపై దాడులు జరుగుతుంటే 'నారీశక్తి వందన్' ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగా మాత్రమే చూస్తోందని ఆమె వ్యాఖ్యానించారు.అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారిని అర్ధరాత్రి అరెస్టు చేయించి అవమానించారని దుయ్యబట్టారు. రెండేళ్ల పాలనలో కుటుంబాలపై రూ.15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపిన కూటమి ప్రభుత్వం, మహిళలను ఉద్ధరించామని చెప్పుకోవడానికి సిగ్గుపడాలని షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు గ్యాస్ ధరల భారాన్ని ప్రభుత్వమే మోసేదని ఆమె గుర్తుచేశారు.

## కాంగ్రెస్ నిర్ణయంతో ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. యూపీఏ ప్రభుత్వం ఆరోజు తీసుకున్న నిర్ణయం భారత్, ఇరాన్ సంబంధాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి అనుకూలంగా మాట్లాడకపోయినా పర్వాలేదు కానీ ప్రజల్లో భయాందోళనలు కలిగించే తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు.గతంలో ఇరాన్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన కాంగ్రెస్, ఇప్పుడు ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడుతున్నట్లు నటిస్తూ, భారతదేశంలో చమురు కొరత ఉందని తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. యూపీఏ హయాంలో కేవలం 16 దేశాల నుంచి మాత్రమే చమురు దిగుమతి చేసుకునే వారమని, నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక ఆ సంఖ్య 40 దేశాలకు పెరిగిందని అన్నారు. గ్యాస్ సిలిండర్ ధరలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆయన హామీ ఇచ్చారు.దేశంలో తగినంత ఇంధనం, గ్యాస్ స్టాక్ ఉందని రామచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆందోళన కలిగించే అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. చైనాతో రహస్య ఒప్పందాలు చేసింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు.తెలంగాణలో ఖజానా ఖాళీ అయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం కథలు చెబుతున్నారని, కానీ అదే ప్రజల ధనంతో ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని తెలిపారు. తెలంగాణలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు.

# గోకవరం టీచర్ కృష్ణవేణికి అరుదైన పురస్కారం.

**గోకవరం పెన్ పవర్ మార్చి 08:--** బిందు సొసైటీ మగువోత్సవము ఇంటర్నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా గోకవరం జడ్పీ హైస్కూల్లో హిందీ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న రోబ్బీ కృష్ణవేణికి అరుదైన పురస్కారం లభించింది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత , ప్రత్యేక అతిథులుగా గా ఎం.వి.ప్రణవ్ గోపాల్, చైర్ పర్సన్ వి.ఎం.ఆర్.డి.ఏ విశాఖపట్నం ,డా. హె.టి వాసప్ప జనరల్ మేనేజర్ ,యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం, లక్ష్మీ ముక్కవిల్లీ,ఎండి ,పాత్ర ఇండియా, బీపీఓ సర్వీస్ వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కృష్ణవేణి కి గతంలో 2025 సెప్టెంబర్ 5వ తారీఖున గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు.బిందు సొసైటీ ఫౌండర్ హిమబిందు సమాజానికి ,స్త్రీలకు చేస్తున్న సేవా కార్యక్రమాలను స్త్రీ సాధికారతకు పాటుపడు తున్న సేవలను అతిధులు కొనియాడారు. ఈ సందర్భంగా




గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న కృష్ణవేణి బిందు సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.




# మహిళలు అన్ని రంగాలలో రాణిస్తారు



-జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి


**ఏలూరు మార్చ్ 8 పెన్ పవర్ :** మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పనిచేస్తారని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా స్థానిక గిరిజన భవన్ లో ఏ పి ఎన్జీవోస్ ఏలూరు విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో పురుషుల కంటే అధికంగా రాణిస్తారన్నారు. మహిళలు పురుషులతో దేంట్లోనూ తీసిపోరని, ప్రోత్సాహం, అవకాశం, చేయూత అందిస్తే పురుషులకంటే ఎక్కువగా తమ సత్తా చూపుతారన్నారు. మహిళాభివృద్దికి విద్య ఎంతో ముఖ్యమని, కుటుంబంలో ఒక మహిళా విద్యావంతురాలైతే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, ప్రతీ ఇంట్లో బాలికల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతీ మహిళా విద్యావంతురాలైతే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు పురుషులకు ఏ విషయంలో కూడా తీసిపోరని, అన్ని రంగాలలో పురుషులకంటే మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పనిచేస్తారన్నారు. మహిళల సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో చేయూతను ఇస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రతీ మహిళా ప్రగతిపథంలో నడవాలన్నారు. మన దేశానికీ చెందిన మహిళలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమసత్తాను చాటి, మన దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతీ మహిళా తనకు అభిరుచి ఉన్న రంగంలో అభివృద్ధి చెందేందుకు ప్రయత్నించాలని, అందుకు తగిన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. .


మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలైన మహిళలకు బహుమతులను వివిధ శాఖలలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగినులకు మెమొంటోలను కలెక్టర్ బహూకరించారు.

కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, ఐసిడిఎస్ పీడీ పి . శారద, ఏ. పి . ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, ఏ. పి . ఎన్జీవోస్ నాయకులు హరనాథ్, వివిధ శాఖల మహిళఉద్యోగినులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లాలో ఏరులైపారుతున్న బెల్ట్ మద్యం







- ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టం
- ప్రభుత్వ మద్యం పాలసీ అంటే ఇదేనా
- మామూళ్ల మత్తులో అధికార గణం

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ పోలవరం (రంపచోడవరం), మార్చి 8 :**పోలవరం జిల్లాలో అక్రమ బెల్ట్ మద్యం విక్రయాలు విస్తృతంగా పెరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని సుమారు 12 మండలాల్లో దాదాపు ప్రతి గ్రామంలో ఒకటి లేదా రెండు బెల్ట్ షాపులు నడుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల వరకు మద్యం విక్రయాలు విస్తరించడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లాలోని 11 మండలాల్లో ప్రభుత్వం 18 మద్యం షాపులను మంజూరు చేస్తే క్షేత్రస్థాయిలో మాత్రం ప్రతీ షాపు పరిధిలో రెండంకెల స్థాయిలో బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. లైసెన్సుడ్ మద్యం షాపుల్లో దొరకని బ్రాండ్లు కూడా ఈ బెల్ట్ షాపుల్లో దర్శనమిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రాల నుండి కూడా అక్రమంగా మద్యం దిగుమతి చేసుకుంటున్నారు.ప్రభుత్వం బెల్ట్ షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని పలుమార్లు ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులే బెల్ట్ మద్యం సిండికేట్‌ను నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల అధికార పార్టీ నాయకులకు సంబంధించిన షాపులు ఉండటంతో ఎక్సైజ్ అధికారులు కూడా వాటిపై చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.జిల్లాలో ఉన్న లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల్లో కూడా ఎమ్మార్పీ ధరలకు మించి వసూళ్లు జరుగుతున్నాయని మద్యం ప్రియులు చెబుతున్నారు. బెల్ట్ షాపుల్లో అయితే ధరల దందా మరింత ఎక్కువగా జరుగుతోందని సమాచారం. ఒక్క క్వార్టర్ బాటిల్‌పై రూ.20 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా షాపులు వద్దే అన్ని సౌకర్యాలతో బార్ లను తలపించే స్థాయిలో ఉంటున్నాయి.గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురవుతున్నా మద్యం మాత్రం ఎక్కడ చూసినా అందుబాటులో ఉందని గ్రామస్థులు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.ఈ విషయమై ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తే సిబ్బంది కొరత కారణంగా పర్యవేక్షణలో సమస్యలు ఉన్నాయని చెబుతున్నారని సమాచారం. జిల్లాలో బెల్ట్ షాపులు లేవని, అన్నీ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నడుస్తున్నాయని వారు సమాధానం చెబుతున్నారని స్థానికులు అంటున్నారు. జిల్లాలోని ఏ మండలం నుండైనా బెల్ట్ షాపులు నిర్వహణపై కథనాలు వస్తే ఎక్సైజ్ అధికారులు తూతూ మంత్రంగా ఆ షాపు పరిధిలో ఏదో ఒక కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కేసులు కూడా మద్యం సిండికేట్ల కనుసనల్లోనే జరుగుతుంది. మద్యం సిండికేట్ అప్పగించిన వారిపై కేసులు నమోదు చేసి తమ డ్యూటీ అయిపోయిందని ఎక్సైజ్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ బెల్ట్ షాప్ ల నిర్వహణతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయం కూడా గండిపడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలైన పోచమ్మ గండి, మారేడుమిల్లి తదితర ప్రాంతాల్లో అక్రమ మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతుంది.అక్రమ మద్యం విక్రయాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వాటిపై స్పందన లేకపోవడంతో పాటు ఫిర్యాదు చేసిన వారిపైనే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఫిర్యాదులు చేయడానికి కూడా వెనుకంజ వేస్తున్నారని తెలుస్తోంది.ఇంకా బడి, గుడి వంటి ప్రజా స్థలాల సమీపంలో మద్యం షాపులు ఉండకూడదనే నిబంధనలను కూడా కొన్నిచోట్ల పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.గత ప్రభుత్వ కాలంలో మద్యం షాపులు ప్రధానంగా మండల కేంద్రాలకు మాత్రమే పరిమితమయ్యేవని, ప్రస్తుతం మాత్రం గ్రామాల వరకు విస్తరించాయని ప్రజలు చెబుతున్నారు. గతంలో స్థానికంగా లభించే నాటు సారా పై ఆధారపడిన మద్యం ప్రియులకు బెల్ట్ షాపుల ద్వారా లభిస్తున్న మద్యానికి అధిక ధరలు చెల్లించి ఆర్థికంగా కుటుంబం నష్టపోతున్నాయని మహిళల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . జీవనోపాధి కోసం నాటు సారా తయారీ లేదా అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేసే ఎక్సైజ్ అధికారులకు బెల్ట్ షాపులు దందా కానరావడం లేదా అంటూ పలువురు సారా వ్యాపారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు .ఈ పరిస్థితులన్నింటినీ పరిశీలిస్తే జిల్లాలో ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అక్రమ బెల్ట్ షాపులపై తక్షణ చర్యలు తీసుకొని గ్రామాల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# బాలికా విద్యతోనే సమాజ మార్పు











- ఘనంగా తూర్పు గోదావరి జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- స్వయం సహాయక సంఘాలకు రూ.1,440 కోట్ల రుణాల చెక్కులు పంపిణీ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 8:**మహిళా సాధికారత అనేది కేవలం ఒక నినాదం మాత్రమే కాకుండా ప్రతి మహిళ జీవితంలో ఆచరణలో ఉండాల్సిన అంశమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి చేసిన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఇంకా మహిళలు వివిధ రకాల సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ విద్య, ఆత్మవిశ్వాసం , ఆర్థిక స్వావలంబన తో వాటిని అధిగమించవచ్చని తెలిపారు. బాలికా విద్య సామాజిక మార్పుకు నాంది అన్నారు. ఒక బాలిక చదువుకుంటే కుటుంబం, కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజం, సమాజం బలపడితే దేశం ప్రగతి సాధిస్తుందని ఆన్నారు. ఆడపిల్లల పెళ్లి, బంగారం కోసం ఖర్చు చేసే డబ్బును వారి విద్య కోసం కేటాయిస్తే వారు అద్భుతాలు సృష్టించగలరన్నారు. మహిళ తన జీవిత లక్ష్యాలను సాధించగల శక్తి వచ్చిన రోజునే నిజమైన సాధికారత సాధ్యమవుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, నేడు ప్రతి రంగంలో మహిళలు తమ వంతు భాగస్వామ్యాన్ని సమర్థవంతంగా చాటుకుంటూ, మహిళలు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తు న్నారన్నారు. సమాజంలో మహిళల పట్ల ఉన్న వివక్ష భావన పూర్తిగా మారాల్సిన అవసరం ఉందన్నారు.

నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, సమాజ సమగ్రాభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగితే ఆర్థిక స్వావలంబన, కుటుంబం, సమాజం అభివృద్ధి వేగవంతమవుతుంద న్నారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తున్నదని, స్వయం సహాయక సంఘాల మహిళలకు పరిశ్రమల స్థాపనకు రుణ సదుపాయాలు, సబ్సిడీలు, శిక్షణ , మార్కెటింగ్ సహాయం వంటి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాల దశ నుంచే ఆడపిల్లల పట్ల గౌరవ ప్రవర్తన పై మగపిల్లలకు బోధించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు.రూడా చైర్‌పర్సన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ . ఆధునిక ప్రజా జీవితంలో రాజకీయ, పారిశ్రామిక రంగాలతో పాటు న్యాయ, పోలీసు తదితర రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. బాలికల చదువుపై అవగాహన పెరగడంతో డ్రాప్ అవుట్లు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

ఈ వేడుకల్లో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి టి. శ్రీదేవి, మహిళా అధికారులు పి. భాగ్యవతి, బి.కె.ఎన్. జ్యోతి, నాతి బుజ్జి, వి. శాంతామణి, వి. పార్వతి, పి. వీణాదేవి, శైలజావల్లి, వి. వినూత్న తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ:

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరం లో స్వయం సహాయక సంఘాల మహిళలకు భారీ స్థాయిలో రుణాల చెక్కులను పంపిణీ చేశారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ లింకేజ్ పథకాల కింద రూ.424 కోట్ల రూపాయల విలువైన రుణాల చెక్కులు అందజేశారు. డి.ఆర్.డి.ఎ సెర్ప్ బ్యాంక్ లింకేజ్ స్త్రీనిధి పథకాల ద్వారా 75,650 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ రూ.1,016 కోట్ల రూపాయల రుణాల చెక్కులను పంపిణీ చేసి మహిళల ఆర్థిక సాధికారతకు బలం చేకూర్చారు.

# అధిక లోడ్, నిబంధనలు ఉల్లంఘించిన రెండు ఇసుక లారీలు సీజ్






**అపరాధ రుసుము రూ.1,74,000 వసూలు**

**జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 8 :**తూర్పు గోదావరి జిల్లాలో నియమాలను ఉల్లంఘించి అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలపై చర్యలు తీసుకున్నట్లు జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ తెలిపారు. ప్రభుత్వం ఆదేశాలు మేరకు, రవాణా శాఖ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేస్తున్న నేపథ్యంలో, అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను సీజ్ చేసినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. రాజానగరం హైవే పరిధిలో లాలా చెరువు సమీపంలో ఈ రెండు లారీలను పట్టుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి మొత్తం రూ.1,74,000 అపరాధ రుసుము వసూలు చేసినట్లు జిల్లా రవాణా అధికారి తెలిపారు. సీజ్ చేసిన వాహనాలకు విధించిన అపరాధ రుసుము చెల్లించిన అనంతరం వాటిని విడుదల చేసినట్లు తెలిపారు.ఇసుక రవాణా చేసే వాహన యజమానులు, డ్రైవర్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఇసుకను నిర్ణీత పరిమితి మేరకు మాత్రమే లోడ్ చేయాలని, రహదారులపై ఇసుక జారీ పడకుండా తప్పనిసరిగా టార్పాలిన్ కప్పి రవాణా చేయాలని రవాణా శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.



పెన్ పవర్
సోమవారం 9 మార్చ్ 2026

# అంగరంగ వైభవంగా మావుళ్ళమ్మ తల్లి వెండి కవచం ఊరేగింపు...





- వేలాదిగా తరలివచ్చిన భక్తులు,
- అడుగడుగునా హారతులు పట్టిన మహిళలు

**సీతానగరం , పెన్ పవర్, మార్చి 08:** సీతానగరం గ్రామ దేవత మావుళ్ళమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు 10 లక్షలు రూపాయలు వ్యయంతో తయారు చేయించిన వెండి కవచం ప్రజల దర్శనార్థం ఆదివారం నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బొబ్బిలంక గ్రామం నుంచి ప్రారంభమైన ఊరేగింపు జాలిముడి, కాటవరం, మునికూడలి, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనగారివారి పేట, ముగళ్ళ,రాపాక, రఘదేవాపురం, సీతానగరం మెయిన్ సెంటర్ మీదగా మావుళ్ళమ్మ అమ్మవారి అలయం వరకు ఘనంగా సాగింది. ఊరేగింపుకి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దారి పొడుగునా భక్తులు పూల వర్షం కురిపించారు. ప్రతి గ్రామంలో కూడా మహిళలు హారతులు పట్టి, అమ్మవారి వెండి కవచాన్ని దర్శించుకున్నారు. ఊరేగింపు అనంతరం ఆలయంలో అమ్మవారిని కంబాల శ్రీనివాసరావు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వెండి కవచాన్ని కంబాల శ్రీనివాసరావు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా అలంకరించారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కంబాల శ్రీనివాసరావుని సత్కరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారికి వెండి కవచ కిరీటం ఎంతో అద్భుతంగా ఉందన్నారు. తయారు చేసిన శిల్పిని ఆయన అభినందించి, పది వేలు రూపాయలు బహుమానం అందించారు. అమ్మవారికి కవచం చేయించి, అలంకరించే అదృష్టం నాకు కలగటం ఆనందంగా ఉందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలకు నిరంతరం సేవ చేస్తూనే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం

## కృషి-ఎమ్మెల్యే బాలరాజు,సాఫ్ డైరెక్టర్ జగదీశ్వరి





**పోలవరం,పెన్ పవర్ మార్చి 8:**రాష్ట్రం లోని మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నియోజకవర్గంలోని బుట్టాయగూడెంలో ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలరాజు మహిళల గురించి మాట్లాడారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పేర్కొన్నారు.అనంతరం రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ సమాజంలో మహిళలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేసింది తెలుగు దేశం పార్టీ అన్నారు.ఆనాటి సమాజంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మహిళలను ఐక్యపరిచి మహిళా సమైక్యత సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి ఆర్థిక తోడ్పాటు కల్పించడం జరిగిందన్నారు.పురుషులతో సమాన అవకాశాలు కల్పించడం విద్యా ఉద్యోగ రాజకీయ వ్యాపార రంగాల్లో వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్ పథకాలు అమలు ఉచిత బస్ సౌకర్యం మహిళలను ఆదుకోవడంలో భాగంగా సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందిస్తున్నదన్నారు.అలాగే ఎంతో మంది మహిళా క్రీడాకారులను ప్రోత్సహించి వారికి వివిధ రకాల క్రీడల్లో వారికి శిక్షణ ఇచ్చి వారు రాణించే విధంగా చూడడం జరిగిందన్నారు.రాష్ట్రంలోని మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ లకు జగదీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మహిళా అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

# రామాలయం పునర్నిర్మాణం



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 8;** శ్రీ కోదండ రామాలయనీ మరింత అభివృద్ధి పరిచి భక్తులకు సౌకర్యాలు కల్పించేలా నిర్మాణం చేపట్టనున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. ఆదివారం బర్రింకలపాడు గ్రామంలో శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పాత ఆలయంలో ఉన్న స్వామివారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పక్కనే ఏర్పాటు చేసి తాత్కాలిక ఆలయంలో ప్రతిష్టించారు. గ్రామస్తులు అందరూ సహకరించి ఆలయ నిర్మాణం కి విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, చిర్రి కృష్ణయ్య, సిరి రాంపండు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

## పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.భాస్కర్,వినోద్ కుమార్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్,, మార్చి 8** :రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర అధ్యక్షులు కె. భాస్కర్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలో పీ డీ ఎస్ యూ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుపతిరావు అధ్యక్షత వహించగా ముఖ్య వక్తలుగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, వినోద్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు దారుణంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పీజీ విద్యార్థుల రియంబర్స్మెంట్ కు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తానని ఇచ్చిన హామీ మర్చిపోయారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు రూ .6400 కోట్లు పెండింగ్లో ఉన్నాయని తక్షణమే విడుదల చేయాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటుకరణ ఆపాలని, పిపిపి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ వసతి గృహాల హాస్టల్ విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సొంత భవనాలు ఏర్పాటు చేసి ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యకు రాష్ట్ర బడ్జెట్లో కేవలం 0.77 శాతం మాత్రమే నిధులు కేటాయించి ఉన్నత విద్యను నిర్వీర్యం చేశారన్నారు. ఖాళీగా ఉన్న 4200 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కుటమీ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నాని, జిల్లా నాయకులు ఆర్ తిరుపతిరావు వి దుర్గాప్రసాద్ బి ప్రతాప్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 08.** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదరణ సేవా సంస్థ అధ్యక్షురాలు అయిన షర్మిల ని సన్మానించారు .ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా శ్రీ వై.వి.సాయిబాబా మరియు సిబ్బంది పాల్గొన్నారు మరియు రీడర్స్ క్లబ్ సభ్యులు బాపయ్యశర్మ గారు మహిళలు అన్ని రంగాలలోనూ ముందు ఉంటున్నారని రాబోయే 2028 ఎన్నికల్లో మహిళ లే ముందుంటారని అన్నారు. సన్మాన గ్రహీత మల్లిపూడి షర్మిల మాట్లాడుతూ కార్మిక మహిళా దినోత్సవం అనేపదం నుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా రూపాంతరం చెందింది కానీ సమానత్వం అనేది ఇంకా రాలేదని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడారు. పత్తి వీరాస్వామి; వి.జాన్ బాబు; ఏ జనార్దన్ రావు. ఏ రాజశేఖర్ .కె వి సత్య ప్రకాష్ .బాపూజీ .లావణ్య సూర్య తదితరులు పాల్గొన్నారు.

# చెత్త కుప్పలు తొలగించరూ..



**ఏలూరు మార్చి 8 పెన్‌పవర్ :** ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్ ఓ హెచ్ఆర్ సమీపంలోని సుబ్రమ్మణ్యం కిరాణా కొట్టు రోడ్‌లో డ్రైనేజీలో చెత్త తోలగించి రోడ్ పోసి 3 నెలలు గడుస్తున్నా తొలగించక పోవడంతో చెత్త కుప్పలు అధికంగా ఉన్నాయి.దీంతో ఆటుగా ప్రయాణించే వాహన దారులు,పాద చారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు.గాలికి వ్యర్దాలు ఒక్క సారిగా కొట్టుకు వచ్చి వాహనదారులపై పడుతున్నాయి.రాత్రి వేళల్లో చీకటి మాటున రహదారి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.పరిసర ప్రాంతాల ప్రజలు ఆహార వ్యర్దాలు వ్యర్దాలపై సోస్తుండటంతో ఈ వ్యార్దాలను తినడానికి వచ్చిన శునకాలు వాహనదారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి.ఏలూరు నగర పాలక సంస్ద 18వ డివిజన్ సర్కిల్ కార్యాలయం ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ లేక పోవడంతో రాజీవ్ గృహ కల్పకాలనీలో డ్రైనేఈలలో మురుగు పారక, రహదారులుపై మొక్కలు మొలిచి ,పారిశుధ్య సమస్యలతోడివిజన్ ప్రజలు ఇబ్బందులకు గురవుతునానరు.నగరపాలక సంస్ద పారిశుధ్య విభాగం అధికారులు స్పంచించి చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్ద ఉన్నాతాధికారులను డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

# నిబంధనలు పాటించని క్వారీ బూడిద లారీలు






**వై రామవరం, పెన్ పవర్, మార్చ్ 8 :** రహదారులపై లోడుతో వెళ్లే ప్రతి వాహనం నిబంధనలు పాటించకుండా అతి వేగంతో వెళ్లడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంఘటనలు మండలములో కొనసాగుతున్నాయి.

ఇసుక, ఇటుక, సీసీ బాండ్లు, క్వారీ మెటల్, క్వారీ బూడిద, లారీలు, ట్రాక్టర్లు ఏదైనా కానీ ధూళి చెలరేగకుండా ఉండే విధంగా టార్పలెన్ ను కప్పి ఉంచాలనే నియమ, నిబంధనలు ఉన్నాయని పలువురు అంటున్నారు. ఒక్కొక్కసారి లారీలు ట్రాక్టర్ల పై టార్పాలిన్ కప్పి ప్రయాణిస్తున్నారని, చాలా సందర్భాలలో బహిరంగంగానే అతివేగంతో ప్రయాణిస్తున్నాయని అంటున్నారు. వాహనాల వెనుక భాగంలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల కళ్ళల్లో ఇసుక, బూడిద పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, కొన్ని సందర్భాలలో ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వీటిపై స్పందించవలసిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు అతివేగంతో రహదారిపై ప్రయాణిస్తున్నాయని అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి లోడుతో వెళ్లే ప్రతి వాహనంపై ఖచ్చితంగా టార్పాలిన్ కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# దశావతారాల మూర్తియే స్త్రీ మూర్తి



**టీ నర్సాపురం, పెన్ పవర్, మార్చి 8:**
ప్రకాష్ నగర్ లో బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఆధునిక మహిళ నేల నుండి ఆకాశానికి ఎదిగిందని, అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా మహిళలు రాణిస్తున్నారని అయినప్పటికీ ఇంకా స్త్రీలపై వివక్షత, లైంగిక దాడులు, వరకట్న వేధింపులు, పురుషాధిపత్యాలు కొనసాగుతూనే ఉన్నాయని వాటి నుండి స్త్రీలకు విముక్తి కలిగినరోజే స్త్రీలకు నిజమైన స్వాతంత్ర్యం, సమానత్వం వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కృష్ణవేణి, మల్లీశ్వరి లను సంఘం తరుపునసన్మానించారు. ఈ కార్యక్రమంలో భూక్యా పోతు రాజు, కుంజా కిరణ్, భరగడం రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలి- ఎమ్మెల్యే మద్దిపాటి.





**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 8.** మహిళలు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిచి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వెంకట్రాజు మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని స్వయం సహాయక సంఘాల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందించడం జరుగుతున్నది అన్నారు. మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందడం అభినందనీయం అన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. అలాగే సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం ద్వారా అందించి వారికి ఆర్థికంగా కొంత ఆసరాగా నిలవడం జరిగిందన్నారు. మహిళలు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. అలాగే మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నదన్నారు. మహిళల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కుటీర పరిశ్రమ నెలకొల్పే విధంగా ప్రభుత్వం ఆలోచనలను చేస్తున్నది అన్నారు. సమాజంలో మహిళలను గుర్తించి వారికి ఆర్థిక భద్రతను కల్పించింది తెలుగుదేశం పార్టీ అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ నుండి ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరకు మహిళా పక్షపాతిలేనని మహిళల అభ్యున్నతికి వీరు నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ భరోసా ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మహిళల అభ్యున్నతికి ఎనలేని సేవలు అందిస్తున్నారని ప్రభుత్వ ప్రవేశపెడుతున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని తమ కాళ్లపై తాము నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల రుణాలకు సంబంధించిన చెక్కును అందజేశారు. సమావేశానికి ముందు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా దినోత్సవం




**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 8;** మహిళా సాధికారత కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని జీలుగుమిల్లి మండలం సిపిఐ కార్యదర్శి కారం ధారయ అన్నారు. ఆదివారం ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్వర్ణ వారి గూడెం గ్రామం వద్ద నిర్వాసిత ఆర్ అండ్ ఆర్ కాలనీలో మహిళా సాధికారత జెండాను ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మిరియాల వెంకటమ్మ ఆవిష్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించేందుకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని సూచించారు. మహిళలు స్వయం శక్తితో ఎదిగేందుకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కారం సావిత్రి ,కారం చంద్రకళ, కారం సీత ,మిరియాల కృష్ణవేణి, మాయ బోయిన నారాయణమ్మ ,సోడే కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలి.

మాజీ మంత్రి వనిత.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 8.** పరమశివుని ఆశీస్సులు నియోజకవర్గంలోని ప్రజానీకంపై ఎల్లప్పుడూ ఉండాలని గోపాలపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, మాజీ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామంలో ఉన్న శివాలయాన్ని వనిత ఆదివారం సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని అక్కడ ఉన్న శివలింగానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వనితకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కే సతీష్, మహిళా నాయకురాలు ఆచంట అనసూయ, నరహరశెట్టి రాజేంద్రప్రసాద్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం:ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 08.** మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ రంగారావు కూడలిలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను కలిగించే విధంగా స్వయం ఉపాధి పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దటానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు. మహిళలను గౌరవించడం,పూజించటం మన సనాతన ధర్మంలో భాగమని, అర్ధనారీశ్వర తత్వం అదే చెబుతుందని అన్నారు. వందల సంవత్సరాలుగా విదేశీయులైన మొగలులు, బ్రిటిష్ వారి పాలన ఫలితంగా సనాతన ధర్మానికి ఎంతో హాని కలిగిందని అన్నారు.మహిళలను ఆటబొమ్మలుగా చూసే విదేశీ సంస్కృతి దేశంలో ప్రవేశించిందని అన్నారు. 1947లో స్వాతంత్ర సాధన అనంతరం మన ధర్మాన్ని కాపాడుకునే అవకాశం కలిగిందన్నారు. ఝాన్సీ లక్ష్మీబాయి తదితర ఎందరో వీర నారీమణులు స్వాతంత్ర పోరాటం చేసి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. డొక్కా సీతమ్మ వంటి సేవా గుణం కలిగిన ఆదర్శ మహిళలను నేటికీ మనం అనుసరిస్తున్నామన్నారు.ఈ ఆదర్శలతోనే ప్రధాని నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ లు మహిళల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. శ్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం, డ్వాక్రా మహిళలకు వివిధ పథకాల ద్వారా రుణాలు ఇచ్చి స్వయం ఉపాధి కల్పించారన్నారు. మహిళల రక్షణకు ఫోన్లలో ప్రత్యేక యాప్ ల ద్వారా ఎక్కడ ఏ నేరం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారన్నారు. ఎక్కడ ఏ మహిళ ఆపదలో ఉన్నా తక్షణమే ఆ ప్రదేశానికి పోలీసులు చేరుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రక్షణ చర్యలు చేపట్టారన్నారు. తాడేపల్లిగూడెం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని, మహిళా మణులందరూ భాగస్వాములు కావాలని కోరారు. అభివృద్ధి వేగవంతమవుతుందనే ఉద్దేశంతో తాహాశీల్దార్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ తదితర ప్రభుత్వ అధికారులుగా మహిళలను తీసుకువచ్చామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రతి మహిళ అందిపుచ్చుకొని, సాధికారత సాధించి, దేశాభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. మహిళా దినోత్సవ సందర్భంగా పలువురు ప్రభుత్వ మహిళా ఉద్యోగులను సత్కరించారు. మరియు పెదతాడిపల్లి గ్రామానికి చెందిన గ్రూప్ వన్ సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సాధించిన సందర్భంగా జాలాది రమ్యశ్రీ, ఈ కి ఎమ్మెల్యే సత్కరించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర భవన నిర్మాణ ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్

వలవల బాబ్జి, బిజెపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జి ఈతకోట తాతాజీ, ఎమ్మార్వో రాజరాజేశ్వరి, ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, స్పెషలాఫీసర్ మల్లికార్జున రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చేపల మంగ బాయ్ భోగి రెడ్డి ఆదిలక్ష్మి పైడికొండల సింధు, కట్టు బోయిన వెంకటలక్ష్మి, దాసరి కృష్ణవేణి వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, మద్దాల మణికుమార్, వాడపల్లి సుబ్బరాజు, పసల కొండ, కూటమి నాయకులు తదితరులు మాట్లాడారు.





02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# జిల్లాలో పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లకు కౌన్సిలింగ్






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 8** :తూర్పుగోదావరి జిల్లా ఎస్పి డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల రౌడీ షీటర్లకు, గంజా బ్యాచ్ , బ్లేడ్ బ్యాచ్ లకు సంబంధిత ఎస్.హెచ్.ఓ ల ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ, అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి కేసుల్లో ఇన్వాల్వ్ అయిన ఉపేక్షించేది లేదని, వారిపై తీవ్ర చర్యలు తీసుకుంటామని,

పి.డి యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. గంజాయి సేవించడం, విక్రయించడం చేయరాదని, గంజాయి వివిధ మానసిక, శారీరక ప్రభావాలను కలిగి ఉంటుందన్నారు . వీటిలో మానసిక స్థితి, సమయ భావం, ఏకాగ్రత, స్వల్పకాలిక జ్ఞాపకశక్తి బలహీనపడటం జరుగుతుందని, బలహీనమైన శరీర కదలిక ఉంటాయన్నారు.

# కోరుకొండ పీఎంపీల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 8:** కమ్యూనిటి పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) కోరుకొండ మండలం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వైద్యురాలు డాక్టర్ పి విజయలక్ష్మి ఎంబీబీఎస్ ను గౌరవ సత్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున తనని గౌరవంగా సత్కరించిన పీఎంపీ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుంచే వినోద్,కార్యదర్శి సూరిశెట్టి భాస్కర్, కోశాధికారి బిహెచ్ శివకుమార్, అమర శెట్టి ప్రసాద్, తగరంపూడి వెంకటేశ్వరరావు,జోగారావు,వినీత్ తదితరులు పాల్గొన్నారు.

# కొంతమూరు గ్రామంలో మంచినీటి సమస్యపై బిజెపి జిల్లా అధ్యక్షులు పర్యటన




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 8** :జిల్లావ్యాప్తంగా త్రాగునీటి మంచినీటి సమస్యలపై భారతీయ జనతా పార్టీ జనతా వారధి జట్టు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా ఆదివారం రాజమహేంద్ర వరం రూరల్ మండలం కొంతమూరు గ్రామంలో శేషాద్రి లేఅవుట్ చుట్టుపక్కల దాదాపు 200 కుటుంబాలకు తాగునీటి సమస్యపై జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో జనతా వారధి జట్టు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. స్థానికులు ప్రతి ఇంటికి నీటి సరఫరా లేదని నీటి నాణ్యత ఇబ్బందికరంగా ఉందని తద్వారా వృద్ధులు, పిల్లలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఈ సమస్యను జనతా వారిది ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ద్వారా అవసరమైన చర్యలపై చర్చిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగల శివకుమార్, మండల కార్యదర్శి విశ్వకోటి దుర్గారావు స్థానిక బిజెపి నేతలు పడాల హాతీరాం సూర్యకిరణ్ సత్య శ్రీనివాస్ , ఎమ్మెస్ కే రాజు, సత్యప్రసాద్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ను మర్యాద పూర్వకంగా కలిసిన వడ్డీ రఘురామ్



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 08.** తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ను విశాఖపట్నం లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ గా నియమితులైన సందర్భంగా వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.ఆయన వెంట మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, వైసిపి నాయకులు మాకరాజు సతీష్, కలిశెట్టి తాతారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురం గ్రామానికి గోంతెడుతుంది మంచినీటి సౌకర్యం కల్పించండి...ఏపీ ఆదివాసీ జేఏసీ



**గోకవరం / దేవీపట్నం పెన్ పవర్ మార్చి 08:**--వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు తక్షణమే స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించాలి.దేవీపట్నం మండలం లక్ష్మీపురం గ్రామానికి మౌలిక వసతులు తక్షణమే కల్పించాలి.ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా మీడియాకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు పోలవరం జిల్లా,రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండలం, వి.రామన్న పాలెం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సుమారు 89 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు ఈ గ్రామానికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు అయన విమర్శించారు. గ్రామంలో మూడు చేతి పంపులు ఉన్నప్పటికీ పనిచేయటం లేదన్నారు.గత ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా వాటర్ ట్యాంకు నిర్మించి 45 కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలు వేసినప్పటికీ నేటికీ ప్రారంభించలేదన్నారు.అలాగే గ్రామంలో వీధి లైట్లు ఉన్న వెలగడం లేదన్నారు.ఈ గ్రామంలో వీధి వీధికి సిసి రోడ్లు లేవన్నారు.గుంపెనపల్లి వెలగపల్లి గ్రామాల మధ్యలో ఉన్న కాలువకు బ్రిడ్జి నిర్మించి బీటీ రోడ్డు సౌకర్యం లక్ష్మి పురం గ్రామం నుండి కన్నారం గ్రామం వరకు కల్పించి అంబులెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.వర్షాకాలం వస్తే ఈ ప్రజలు హాస్పిటల్ కి వెళ్లాలంటే ఏడు సముద్రాలు దాటి వెళ్ళినంత పని అవుతుందన్నారు.కావున కాలువకు తక్షణమే బ్రిడ్జి నిర్మించాలని మరియు ప్రస్తుతం లక్ష్మీపురం గ్రామ ప్రజలు 3 మంచినీటి బోర్లు పని చేయకపోవడంతో మంచినీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతు అల్లాడుతున్నరన్నారు.ఈ గ్రామానికి జిల్లా కలెక్టర్,ఏపీ ఎస్టి కమిషన్ చైర్మన్ వారు సందర్శించి తక్షణమే మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామానికి మౌలిక వసతులు తక్షణమే కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇరప పండు, కోసు బాపనమ్మ,తురస రత్నకుమారి,దొరబాబు మొదలైన వారు పాల్గొన్నారు.

## మార్కొండపాడు గ్రామంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉచిత మెగా వైద్య శిబిరం.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 08.**మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్కొండపాడు గ్రామంలో లిరక్ష భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, లజాబిలి హాస్పిటల్ మరియు గ్రామ వైద్యులు అల్లాడి బాలాజీ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది.
ఈ వైద్య శిబిరంలో జనరల్ సర్జన్ డాక్టర్ సతీష్ గ మరియు గైనకాలజిస్ట్ డాక్టర్ పీఎస్.. భారతి సుమారు 200 మందికి పైగా గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు.
ఈ సందర్భంగా గ్రామస్థులకు ఈసిజి, బిపి షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం గ్రామ మాజీ ప్రెసిడెంట్ జాలెం సౌధమణి, సంస్థ ప్రతినిధి ఉర్ల రాధ కలిసి డాక్టర్ పీఎస్ భారతి ని సత్కరించారు. అలాగే బిసి సంఘం నాయకులు కామన వెంకటేశ్వర్లు, బొల్లా వీరబాబు కలిసి డాక్టర్ సతీష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ భారతి మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లిరక్ష భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా తమ హాస్పిటల్ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు అల్లాడి బాలాజీ, మట్టా కోట సత్యనారాయణ, అల్లాడి సాయిరాం, ఆలపాటి కిషోర్ మాట్లాడుతూ మహిళలకు శక్తి, ఆత్మవిశ్వాసం కల్పించడం మరియు మహిళా సాధికారతను ప్రోత్సహించడం రక్ష భారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. మహిళలు బలపడితేనే సమాజం బలపడుతుందని పేర్కొన్నారు.

# సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం





**250 మందికి వైద్య సేవలు**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 8:**
గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రామకృష్ణ మిషన్, రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామంలోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ప్రాంగణంలో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు స్వామీ పరిజ్ఞేయానంద మహారాజ్ తెలిపారు.ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ టి.వి. సుబ్బారావు, డాక్టర్ ఉమామహేశ్, డాక్టర్ రాజేష్ ఖన్నా వైద్య సేవలు అందించారు.శిబిరంలో భాగంగా 51 మందికి రక్త పరీక్షలు, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు, 4 మందికి ఈసీజీ పరీక్షలు, 6 మందికి ఎక్సరేలు, 10 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు స్వామీజీ తెలిపారు.అలాగే డాక్టర్ గోపాలం శివన్నారాయణ (ఎం.డి., డీఎం న్యూరో) మరియు వారి బృందం ఆధ్వర్యంలో ఫిట్స్ (మూర్ఛ) వ్యాధిపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 70 మంది రోగులకు మందులు అందజేయడంతో పాటు మూర్ఛ వ్యాధిపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బందితో పాటు వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు.

## మహిళల హక్కుల కోసం పోరాటాలు అవసరం





**స్త్రీముక్తి సంఘం నాయకుల పిలుపు**

**గంగవరం, పెన్ పవర్, మార్చి 8:**అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం కొత్తకొండమొదలు పునరావాస కాలనీ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్త్రీముక్తి సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కామ్రేడ్ ఇల్లా కల్పన అధ్యక్షత వహించారు. సమావేశంలో సుమారు 300 మంది మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు వి. విజయ, మాజీ ఎంపీటీసీ మడి ముత్తమ్మ, ఇల్లా చిన్నమ్మి, మడి గంగమ్మ, వరదకుమారి, వసంత, రాము, అలాగే ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు సత్యనారాయణ, కె. రామిరెడ్డి, వంజం రాజు తదితరులు ప్రసంగించారు.
ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నప్పటికీ, కొన్ని వర్గాలు దీన్ని పండుగలా నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది పండుగ కాదని, మహిళల హక్కుల సాధన కోసం సమస్యలను చర్చించి పోరాట మార్గం నిర్దేశించుకునే రోజు అని తెలిపారు. 1910లో సోషలిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ నాయకత్వంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆరంభమైందని గుర్తు చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో మహిళా సాధికారత అంటే కేవలం సంక్షేమ పథకాలతో సాధ్యం కాదని, కష్టజీవి మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి ప్రజల హక్కులుగా అందాలని ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతాల్లో మహిళలు రక్తహీనత, సికిల్ సెల్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, పౌష్టికాహారం కొరతతో ప్రసవ సమయంలో తల్లిశిశువుల మరణాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు, రవాణా, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల లేమితో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.మహిళలపై జరుగుతున్న హత్యలు, దౌర్జన్యాలకు మద్యం ప్రధాన కారణమని పేర్కొంటూ మద్యం మరియు మత్తు పదార్థాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు.

# మహిళల స్వంత ఆలోచనలకూ విలువలివ్వడమే అసలైన గౌరవం

- రూ . 168 కోట్ల బ్యాంక్ లింకేజ్
- ఋణములు పంపిణీ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 8 :**నేటి సమాజంలో మహిళల స్వంత ఆలోచనలకూ విలువలను ఇవ్వడమే అసలైన గౌరవమని టీడీపీ యువ నాయకులు ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు.రాజమహేంద్రవరం రూరల్ నియోజకవ ర్గం ఎం డి ఓ కార్యాలయం లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిధులుగా టీడీపీ యువ నాయకులు ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్ కిరణ్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ మార్ని వాసు, రూరల్ మండల అధ్యక్షులు మత్సేటి శివ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ, ప్రతీ మహిళా ఏదొక రంగంలో శిక్షణ పొంది మిగతా వారికీ చేయూత, స్వంతంగాను, రాష్ట్రనీకీ అభివృద్ధి చేసే పనిలో భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గం లో స్టేట్ బ్యాంక్ ద్వారా
డి ఆర్ డి ఏ సెర్ప్ బ్యాంక్ లింకేజ్ ఋణాల మంజూరి చెక్ ను 784 సంఘాలకు సంబందించిన 7840 సభ్యులకు రూ.53 కోట్లు రూపాయలు అందించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ద్వారా 643 మంది స్వయం సహాయక సంఘ సభ్యులకు బ్యాంక్ లింకేజ్ ఋణములు రూ . 115 కోట్ల రూపాయలు డ్రాఫ్ట్ ను ఎం. డి. ఓ. అందించారు. అనంతరం మహిళా దినోత్సవం పురస్కరించుకొని పలువురు మహిళలను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఎం సి. డైరెక్టర్ బిందు ఉన్నత అధికారులు, అనదికారులు తదితరులు పాల్గొన్నారు

# మహిళా దినోత్సవం సందర్భంగా గిరికిరణం డైరెక్టర్ ఏ. రత్నంకు మహిళారత్న అవార్డు



**గంగవరం పెన్ పవర్, మార్చి 8:**అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలవరం జిల్లా రంపచోడవరం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరికిరణం అగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ,గంగవరం జడ్పిటిసి ఏ. రత్నం (బేబీ)కు మహిళారత్న అవార్డు ప్రదానం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని 8 మండలాల్లో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ అందిస్తూ మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు.రంపచోడవరం లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత చేతుల మీదుగా ఏ. రత్నంకు మహిళారత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత మహిళల అభివృద్ధికి గిరికిరణం సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా టైలరింగ్ వంటి నైపుణ్య శిక్షణలు ఇవ్వడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.అవార్డు స్వీకరించిన అనంతరం ఏ. రత్నం మాట్లాడుతూ సంస్థ తరఫున ఏజెన్సీ ప్రాంత మహిళల అభివృద్ధికి మరింతగా సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు మరియు పలువురు పాల్గొన్నారు.

# డైమండ్స్ లయన్స్ మహిళా దినోత్సవం.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 08.**సృష్టికి మూలం, ప్రగతికి ప్రాణం.. మహిళలే అని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు.
తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రెజరర్ బడుగు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో గుణ్ణం ఫంక్షన్ హాల్ లో మహిళా దినోత్సవం సందర్భంగా జరుగుతున్న యోగా.ఆటల పోటీలు ఈరోజు తో ముగిసాయి
విజేతలకు శాలువా లతో సత్కారించి సర్టిఫికెట్ అందించారు
లయన్ బడుగు చంద్ర శేఖర్ మాట్లాడుతూ సహనమూర్తి, నిత్యస్ఫూర్తి, భూమి కంటే ఎక్కువ భారం మోసే మహిళలకు పాదాభివందనమని .కుటుంబ భారాన్నిమోస్తూ, ఉద్యోగ బాధ్యతలను నెరవేస్తూ,ఎంతో ఓర్పుతో, నేర్పుతో ముందుకు నడుస్తున్న ఓర్పు, సహనం కలగలసి కనులముందు కదలాడే స్త్రీశక్తి ప్రతిరూపమై,ఆదర్శంగా నిలుస్తున్న అతివలందరికీ, డైమండ్స్ లయన్స్ క్లబ్ తరుపున అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూన్నాం అన్నారు. ఈ కార్యక్రమం లో బడుగు అంజలి టి. చిట్టెమ్మ కె. ప్రశాంతి అవార్డులకు అవార్డు లందించారు. బడుగు అంజలి తులసీరత్నం, ఎస్క్. అంబి, కృష్ణవేణి, మణి, ఉమామహేశ్వరి, లక్ష్మి, శ్యామల, పద్మజ, వెంకటలక్ష్మి, నూకరాజు, శేఖర్ రెడ్డి, బండి శ్రీనివాసరావు, సూర్యావతి, సుంకరవెంకటేశ్వరరావు, దాసం వెంకటరమణ, సూర్యకుమారి, అమర్నాథ్, బుద్దన శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేయాలి



సివిల్ సర్వీసెస్ ముస్సోరి డైరెక్టర్ శ్రీరామ్ తరణి కంటి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 8:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు పక్కాగా అమలు కావాలని సివిల్ సర్వీసెస్ ముస్సోరి డైరెక్టర్ శ్రీరామ్ తరణి కంటి సూచించారు. ఆదివారం ఆయన రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయనకు ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, చింతూరు ఏఎస్పీ హేమంత్, ఐటిడిఏ ఏపీవో (జనరల్) డి.ఎన్.వి రమణ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.పోలవరం జిల్లాలోని పరిపాలనా వ్యవస్థపై డైరెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని మండలాలు, డివిజన్లు, గ్రామాలు ఉన్నాయో, జిల్లా విస్తీర్ణం, రహదారి మార్గాలు, గిరిజన జనాభా వివరాలు, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీస్ కార్యాలయం ఎక్కడ ఏర్పాటు చేసారో, జిల్లాలో ఎన్ని పోలీస్ స్టేషన్లు ఉన్నాయో తెలుసుకున్నారు.ఈ ప్రాంత గిరిజనులు పండించే ప్రధాన పంటల వివరాలు కూడా ఆయన ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఎలా అందిస్తున్నారన్న అంశంపై అధికారులతో చర్చించారు. అనంతరం పోలవరం జల ప్రాజెక్టు మ్యాప్‌తో పాటు పోలవరం జిల్లాకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు.తదుపరి పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను ఎలా స్వీకరిస్తున్నారో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ఏవో ఎర్రం శెట్టిరాజు, మేనేజర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గడపగడపకు శివయ్య కృష్ణార్జున ఫౌండేషన్ ఆధ్వర్యంలో...





**కూనవరం,పెన్ పవర్,మార్చి 8.**సనాతన హైందవ ధర్మం కోసం గడపగడపకు శివయ్య కార్యక్రమాన్ని కృష్ణార్జున ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని చూచిరేవుల గూడెం గ్రామం నందు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చిలుకూరు బాలాజీ శివాలయ ప్రధాన అర్చకులు శ్రీరామదాసి ఆత్మారాం సురేష్ మహారాజ్ స్వామీజీ సనాతన ధర్మం యొక్క గొప్పదనాన్ని వివరించారు.ఈ సందర్భంగా మహాశివ లింగాభిషేకం మంత్రోచ్చారణతో భక్తులసమక్షంలో నిర్వహించారు.స్వామీజీ రుద్రాక్ష ధారణ మంత్రోచ్ఛర్ణతో తన స్వహస్తాలతో భక్తులకు మెడలో వేశారు.తదుపరి మహాఅన్నప్రసాద కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు మండలంలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి నోముల రామారావు,గరిక ముక్కు సుబ్బయ్య,గడప గడపకు శివయ్య టీం సభ్యులు పాల్గొన్నారు.

# పెదపాడు శాఖా గ్రంధాలయంలో ఉపాధ్యాయులకు సన్మానం




**ఏలూరు మార్చి 8 పవర్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రంధాల అధికారి దుగ్గిపోగు జాన్ బాబు స్థానిక ఎంపీపీ స్కూల్ టీచర్ వేమిరెడ్డి వెంకట్ లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది ఘంటా వేణు లకు శాలువాలతో,పూలదండలతో, ఫ్రూట్స్ అందించి ఘనంగా సన్మానించారు. గ్రంథాలయాధికారి మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలలో రాణించడంతోపాటు సమాజంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న ఎందరో మహిళలు అందరికీ అభివందనాలు, అన్ని రంగాల్లో దూసుకుపోతున్న మహిళామూర్తుల శక్తికి,సహనానికి, అనురాగానికి వేల వందనాలు.స్త్రీ ఎక్కడ గౌరవించబడుతుందో అక్కడ దేవతలు నివాసం ఉంటారు అని కొనియాడారు. సమాజంలో మహిళల పాత్ర చాలా ముఖ్యమైనదని ఆడవారికి అనేక చట్టాలు ఉన్నాయని వాటిని న్యాయబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో పెదపాడు గ్రామ పెద్దలు, గ్రంధాలయ పాఠకులు బి.ప్రభాకర్ రాజు,ఎం.పవన్ కృష్ణ, కాకరాల సత్యనారాయణ, గారపాటి నాని, అక్కినేని రామకృష్ణ(బాబి), పిట్టా బ్లెస్సీ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కార్పొరేట్ వైద్య సేవలు మన ఏజెన్సీలో

**నేతాజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**





**కూనవరం,పెన్ పవర్,మార్చి 8.**ఏజెన్సీ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి అత్యాధునిక వైద్య సేవలను చేరువ చేయడమే తమ లక్ష్యమని భద్రాచలం నేతాజీ ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కాకర్ల,డాక్టర్ శ్రీనివాస్ గెడ్డం పేర్కొన్నారు.ఆదివారం కూనవరం మండల కేంద్రంలోని విజయ సాధన పాఠశాలలో నేతాజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ హేమంత్ కాకర్ల మాట్లాడుతూ ఆర్థోపెడిక్ విభాగంలో మోకాళ్ల కీళ్ల మార్పిడి,ఎముకల వ్యాధులు,రోడ్డు ప్రమాద బాధితులకు 24 గంటల అత్యవసర వైద్య సేవలు భద్రాచలంలోనే అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రముఖ లాప్రోస్కోపిక్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ గెడ్డం మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతోనే అత్యాధునిక లాప్రోస్కోపీ శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. అపెండిక్స్,గాల్ బ్లాడర్,కిడ్నీలో రాళ్లు,పైల్స్,ఫిస్టులా వంటి సమస్యలకు లేజర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లను సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు.శిబిరంలో విశేష స్పందన.ఈ శిబిరంలో సుమారు 150 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి,మందులను పంపిణీ చేశారు.సుమారు 2,500 రూ విలువైన బీఎండీ పరీక్షను రోగులకు ఉచితంగా చేశారు.గ్యాస్ సంబంధిత సమస్యలు,ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు నివారణ మార్గాలను సూచించారు.


ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం ప్రతినిధులు జక్కిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,మల్లంపాటి నరసింహారెడ్డి,స్థానిక ప్రముఖులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


# మహిళా హక్కులు పరిరక్షణ కై ఉద్యమించాలి



**కూనవరం,పెన్ పవర్,మార్చి 8.**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలోని కోతులగుట్ట ప్రాథమిక పాఠశాలలో ఐద్వా, యుటిఎఫ్,అంగన్వాడీ, ఆశలు,ఆరోగ్యం శాఖ,ఆయా, సానిటరీ,ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో యం.విజయ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిసిడిఒ అధికారి యం.కవిత మాట్లాడుతూ మహిళా హక్కులు పరిరక్షణ కై మహిళా మణులు ముందు ఉండాలని తెలిపారు.జడ్పిటిసి గుజ్జా విజయ మాట్లాడుతూ మహిళాలు ఇంటికే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న విషయాలు పై అవగాహన కల్గి ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు సుధారాణి, అంగన్వాడీ మండల అధ్యక్షురాలు తెల్లం ముత్తమ్మ,కార్యదర్శి లక్ష్మి ప్రసన్న,యండియం వర్కర్స్ అధ్యక్షులు మండకం భద్రమ్మ, ఆరోగ్య కార్యకర్తలు రాధా, వెంకటమ్మ,కెజిబివి ప్రిన్సిపాల్ యస్ స్వరాజ్యం,ఎపిటిడబ్ల్యూ ఆర్ఎస్ వైస్.ప్రిన్సిపాల్ రాజేశ్వరి, శాంతి,దుర్గ కుమారి పాల్గొన్నారు.

# వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం





- ఆపదలో ఉన్న మహిళలకు ఐదు రకాల సేవలు
- రంపచోడవరం శాసనసభ్యురాలు శిరీష దేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 8 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు ఐదు రకాల సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చామని రంపచోడవరం శాసనసభ్యురాలు, లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి తెలిపారు.ఆదివారం రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న బర్త్ వెయిటింగ్ హాలులో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, చింతూరు ఏఎస్పీ బి. హేమంత్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి సెంటర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు తక్షణ సహాయం అందించేందుకు వన్ స్టాప్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో ఆరోగ్యం, న్యాయ సహాయం, పోలీసు సహాయం, సెటిల్మెంట్ మరియు కౌన్సిలింగ్ సేవలను ఒకే చోట అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.వయస్సుతో సంబంధం లేకుండా సమస్యల్లో ఉన్న మహిళలకు రక్షణ కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. గృహహింస, అత్యాచారం, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలికలపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు వంటి సమస్యల నుంచి బాధిత మహిళలకు ఈ కేంద్రం ద్వారా సహాయం అందుతుందని తెలిపారు.అలాగే మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు 181, 100, 112 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలోని మహిళలు ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా, డీఎంహెచ్ఓ పి. సరిత, సిడిపిఓలు సుచరిత ఆదిలక్ష్మి, క్రాంతి కుమారి, మల్లిక, జయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రత్యేక చర్యలు








రంపచోడవరం శాసనసభ్యురాలు శిరీష దేవి

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 8 :**రాష్ట్రంలో ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని రంపచోడవరం ఎమ్మెల్యే, లెజిస్లేటివ్ చైర్మన్ మిరియాల శిరీష దేవి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, చింతూరు ఏఎస్పీ బి. హేమంత్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం వంటి చర్యలు మహిళ సాధికారతకు దోహదపడుతున్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇచ్చే రుణ పరిమితిని రెండు లక్షల నుండి ఐదు లక్షల వరకు పెంచినట్లు పేర్కొన్నారు.తల్లికి వందనం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల ద్వారా రాష్ట్రంలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత 22 నెలల్లో రాష్ట్రంలో సుమారు 45 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసినట్లు చెప్పారు. అదేవిధంగా దీపం పథకం ద్వారా అర్హులైన మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు.పోలవరం జిల్లాలో మహిళా సంఘాల అభివృద్ధికి బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని, జిల్లాలో 9,070 మహిళా సంఘాలు పనిచేస్తున్నాయని చెప్పారు. శ్రీనిధి, ట్రైకార్, పీఎంఈజీపి వంటి పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. గిరిజన మహిళా సంఘాల ద్వారా వెదురు ఉత్పత్తులు, తేనె, కుంకుడు కాయలు, చీకాకాయ ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేస్తున్నట్లు వివరించారు.వందన్ వికాస్ కేంద్రాల ద్వారా సుమారు వెయ్యి మంది మహిళలు జీవనోపాధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో బాలబాలికలకు పౌష్టికాహారం, టీకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం హెల్ప్‌లైన్‌లు, రక్షణ చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు.రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, దేశ అభివృద్ధిలో మహిళా శక్తి కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పదిమంది మహిళలకు “మహిళ రత్న” అవార్డులు, మరో 18 మందికి ఉత్తమ మహిళ పురస్కారాలు అందజేసి సత్కరించారు. అలాగే పోలవరం జిల్లాలో మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.181.15 కోట్ల చెక్కు, శ్రీనిధి ద్వారా రూ.38.48 కోట్ల చెక్కును ముఖ్య అతిథులు అందజేశారు.అదనంగా మహిళా సంఘాల అభివృద్ధికి సబ్సిడీపై ట్రాక్టర్, బొలెరో వాహనాలను లబ్ధిదారులకు అందజేశారు.కార్యక్రమంలో జిసిసి, పోలీస్, మెడికల్, డ్వాక్రా మహిళా సంఘాల స్టాల్స్‌ను ముఖ్య అతిథులు పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిన్నం బాబు రమేష్, సీతంశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డిఆర్డిఏ పీడీ కమలాకర్ రావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఎంహెచ్‌వో సరిత, ఐసీడీఎస్ పీడీ ఉమా, మైనారిటీ బోర్డు సభ్యుడు షేక్ సుభాని, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# ఒక్క విజయం... ఎన్ని రికార్డులో!

- న్యూజిలాండ్‌పై 96 పరుగుల భారీ విజయంతో టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత్
- టీ20 చరిత్రలో వరుసగా రెండుసార్లు టైటిల్ గెలిచిన తొలి జట్టుగా రికార్డు
- సొంతగడ్డపై వరల్డ్ కప్ గెలిచిన మొదటి ఆతిథ్య దేశంగా టీమిండియా చరిత్ర
- మొత్తం మూడుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన ఏకైక జట్టుగా అవతరణ
- టోర్నీ ఆసాంతం అద్భుత ప్రదర్శనతో 8 మ్యాచ్‌లలో 7 విజయాలు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు ఇది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరులో టీమిండియా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల భారీ తేడాతో చిత్తుచేసిన భారత్, విశ్వవిజేతగా నిలిచింది. 2023లో ఇదే మైదానంలో ఎదురైన పరాజయాల తాలూకు చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, లక్షలాది మంది అభిమానుల సాక్షిగా టీమిండియా విజయకేతనం ఎగురవేసింది. ఈ విజయంతో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం సంబరాలతో మార్మోగిపోయింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గానే కాకుండా, ఫేవరెట్‌గా బరిలోకి దిగి అంచనాలను నిజం చేసింది.

ఒకే విజయంతో మూడు రికార్డులు

ఈ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపు ద్వారా టీమిండియా ఒకేసారి మూడు అరుదైన మైలురాళ్లను అధిగమించింది.

**1. టైటిల్‌ను నిలబెట్టుకున్న తొలి జట్టు:**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టూ వరుసగా రెండుసార్లు కప్పు గెలవలేదు. 2024లో ఛాంపియన్‌గా నిలిచిన భారత్, ఇప్పుడు 2026లో కూడా టైటిల్ గెలిచి, టైటిల్‌ను డిఫెండ్ చేసుకున్న తొలి పురుషుల జట్టుగా రికార్డు సృష్టించింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో తమకు తిరుగులేదని నిరూపించుకుంది.

**2. సొంతగడ్డపై గెలిచిన తొలి ఆతిథ్య జట్టు:**

టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఉన్న ఓ పెద్ద సెంటిమెంట్‌ను భారత్ బద్దలు కొట్టింది. 2007లో టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఏ ఆతిథ్య దేశం కూడా సొంతగడ్డపై కప్పు గెలవలేదు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి జట్లు ఆతిథ్యం ఇచ్చినా కప్పును ముద్దాడలేకపోయాయి. కానీ 10వ ఎడిషన్‌కు శ్రీలంకతో కలిసి ఆతిథ్యం ఇచ్చిన భారత్, సొంతగడ్డపై కప్పు గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది.

**3. మూడుసార్లు విశ్వవిజేతగా:**

ఈ విజయంతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సార్లు వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2007లో ధోని సేన తొలి కప్పు గెలవగా, 2024లో రెండోసారి, ఇప్పుడు 2026లో మూడోసారి టైటిల్ సాధించి 'హ్యాట్రిక్' కొట్టింది. వెస్టిండీస్, ఇంగ్లండ్ చెరో రెండుసార్లు గెలవగా, భారత్ మూడు టైటిళ్లతో అందరికంటే ముందుంది.

**జైత్రయాత్ర సాగిందిలా...**

ఈ టోర్నీలో భారత జట్టు ప్రయాణం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మొత్తం 8 మ్యాచ్‌లలో 7 విజయాలు సాధించి తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించింది. ఫిబ్రవరి 7న ముంబైలోని వాంఖడే స్టేడియంలో అమెరికాపై 29 పరుగుల గెలుపుతో భారత్ తమ వేటను ప్రారంభించింది. అనంతరం ఫిబ్రవరి 12న ఢిల్లీలో నమీబియాను 93 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 61 పరుగుల భారీ విజయం సాధించి అభిమానులకు పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌పై 17 పరుగుల తేడాతో గెలిచింది.

అయితే, ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోనే దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ఏకైక పరాజయం ఎదురైంది. కానీ ఈ ఓటమి నుంచి వెంటనే తేరుకున్న టీమిండియా, ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. మార్చి 1న కోల్‌కతాలో వెస్టిండీస్‌పై 5 వికెట్ల తేడాతో గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్ పోరులో ఇంగ్లండ్‌పై 7 పరుగుల తేడాతో గెలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

**అక్టోబర్ 2023 నుంచి తిరుగులేని ఫామ్**

టీమిండియా ఈ టోర్నీకి ముందు నుంచే అద్భుతమైన ఫామ్‌లో ఉంది. అక్టోబర్ 2023 నుంచి ఇప్పటివరకు ఆడిన గత 56 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఏకంగా 48 విజయాలు నమోదు చేయడం విశేషం. వరల్డ్ కప్‌కు ముందు న్యూజిలాండ్‌పై సిరీస్ గెలిచి పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన భారత్, ఫైనల్ పోరులో అదే జట్టును చిత్తుచేసి విశ్వవిజేతగా అవతరించింది. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా, టీ20 క్రికెట్‌లో ఒక సామ్రాజ్యాన్ని స్థాపించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.?

## చరిత్ర తిరగరాసిన భారత్.. టీ20 ఫార్మాట్‌లోనే

# తొలి జట్టుగా నయా రికార్డ్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్–2026 విశ్వవిజేతగా భారత్ నిలిచింది. 2026, మార్చి 8న గుజరాత్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచులో న్యూజిలాండ్?ను 96 పరుగుల తేడాతో చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్.. ఆ తర్వాత బౌలింగ్?లో రాణించి ఫైనల్ పోరును ఏకపక్షంగా మార్చి వరుసగా రెండోసారి టీ20 వరల్డ్ కప్ కైవసం చేసుకుంది. ఓవరాల్?గా మూడుసార్లు (2007, 2024, 2026) టీ20 వరల్డ్ కప్?ను టీమిండియా ముద్దాడింది. ఈ విజయంతో టీమిండియా పలు రికార్డులు నమోదు చేసింది. టీ20 వరల్డ్ కప్?కు అతిథ్యం ఇచ్చి టైటిల్ గెలిచిన తొలి జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. అలాగే.. వరుసగా రెండు సార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా కూడా ఇండియా రేర్ ఫీట్ నెలకొల్పింది. గుజరాత్?లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచులో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. సంజు శాంసన్ (89), అభిషేక్ శర్మ (52), ఇషాన్ కిషన్ (54) రాణించారు. చివర్లో శివమ్ దూబే 8 బంతుల్లో 26 రన్స్ చేసి మెరుపు ఫినింగ్ ఇచ్చాడు. న్యూజిలాండ్ బౌలర్లలో నీషమ్ 3 వికెట్లు సాధించాడు. మ్యాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం 256 పరుగుల భారీ లక్ష్య ఛేధనకు దిగిన న్యూజిలాండ్ 19 ఓవర్లలో 159 పరుగులకే చాపచుట్టేసింది. ఆది నుంచి భారత బౌలర్లు బెంబేలెత్తించడంతో ఏ దశలోనూ న్యూజిలాండ్ ఛేధన వైపు సాగలేదు. న్యూజిలాండ్ బ్యాటర్లలో ఓపెనర్ సీఫెర్ట్ ఒక్కడే హాఫ్ సెంచరీతో (52) ప్రతిఘటించాడు. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ 43 పోరాడాడు. మిలిగిన బ్యాటర్లంతా చేతులేత్తేయడంతో వరల్డ్ కప్?కు అడుగు దూరంలోనే న్యూజిలాండ్ బోల్తా కొట్టింది.

## ఫైనల్ లో భారత్ గెలవలేదన్నారు.. కట్ చేస్తే టిటైల్ కొట్టేసింది..

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 ఫైనల్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఎన్నో అనుమానాలు, పాత రికార్డులు, అపోహలను పటాపంచలు చేస్తూ భారత్ మరోసారి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడంతో కొందరు అభిమానులు సందేహాలు వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో భారత్ గెలవలేదని, ఈసారి కూడా అదే జరుగుతుందని పేర్కొన్నారు. అంతేకాదు, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఇండియాకు అచ్చిరాదని కూడా అన్నారు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో న్యూజిలాండ్‌పై భారత్ విజయాలు చాలా తక్కువగా ఉన్నాయనే గత రికార్డులను కూడా పలువురు గుర్తు చేశారు. కానీ ఈసారి టీమిండియా ఆ అనుమానాలన్నింటినీ తుడిచిపెట్టింది. బ్యాటింగ్‌లో భారత బ్యాటర్లు దూకుడుగా ఆడి 255 పరుగుల భారీ స్కోర్ చేశారు. అనంతరం బౌలింగ్‌లో క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టును ఒత్తిడిలోకి నెట్టారు. ఫీల్డింగ్‌లో కూడా అద్భుతమైన క్యాచులు, ఫీల్డింగ్‌తో మ్యాచ్‌పై భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఆల్రౌండ్ షోతో రాణించిన టీమిండియా ఈ విజయంతో మరోసారి విశ్వవిజేతగా అవతరించింది. భారత్ వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. 40 కోట్ల మంది భారతీయుల ఆశలను నిజం చేస్తూ సూర్యకుమార్ యాదవ్ సేన పొట్టికప్పును సొంతం చేసుకుంది. అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 96 పరుగుల తేడాతో

విజయం సాధించింది. అయితే టీమిండియా ఇప్పటి వరకు మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలో 2007లో టీ20 వరల్డ్ కప్ ని తొలిసారి గెలవగా.. అనంతరం 2024లో రోహిత్ శర్మ ఆధ్వర్యంలో రెండోసారి సొంతం చేసుకోగా.. 2026లో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో భారత జట్టు మూడోసారి విశ్వవిజేతనగా అవతరించింది.



అనసూయ భరద్వాజ్ వైబింగ్ హైపై దృష్టి సారించింది

# 'ఉస్తాద్' సర్ప్రైజ్ టీజ్.. పెర్ఫెక్ట్ కమర్షియల్ బొమ్మలా ఉందే!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి తాజాగా విడుదలైన సర్ప్రైజ్ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుంటోంది. స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఆ కమర్షియల్ ఎంటర్టైనర్ ఉగాది కానుకగా మార్చి 19వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మేకర్స్ ట్రైలర్ కు ముందు చిన్న వీడియోను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి పెంచారు. ట్రైలర్ టీజ్ పేరుతో విడుదలైన ఆ గ్లింప్స్ లో పవన్ కళ్యాణ్ మాస్ స్టైల్‌లో కనిపిస్తూ అభిమానులను అలరిస్తున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో భగవద్గీత శ్లోకాలు వినిపిస్తుండగా పవన్ చెప్పిన డైలాగ్ అభిమానులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. "ఇందాక విన్నది భగవద్గీత.. ఇది భగత్ గీత.. దమ్మున్నోడు దాటొచ్చు" అంటూ ఆయన చెప్పిన డైలాగ్ సోషల్ మీడియాలో ఫుల్ గా ఫ్యాన్స్ వైరల్ చేస్తున్నారు.సుమారు 43 సెకన్ల నిడివి ఉన్న ఉస్తాద్ భగత్ సింగ్ టీజ్‌లో పవన్ కళ్యాణ్ ను పలు లుక్స్ లో చూపించారు మేకర్స్. ముఖ్యంగా పోలీస్ ఆఫీసర్ గెటప్ లో ఆయన కనిపించడం ఆకట్టుకుంటోంది. లుంగీతో మాస్ స్టైల్, కౌబాయ్ క్యాప్ తో మరో స్టైలిష్ లుక్ లో కనిపిస్తూ ఆయన ఆకర్షించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాలో ఎక్కువ ఉండనున్నాయని మేకర్స్ హింట్ ఇచ్చారు.సినిమా పెర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్నట్లు టీజ్ చూస్తే క్లియర్ గా తెలుస్తోంది. హరీష్ శంకర్ తన స్టైల్ కు తగ్గట్లుగా పంచ్ డైలాగులు, మాస్ ఎలిమెంట్స్ తో సినిమాను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది.

గతంలో పవన్ కళ్యాణ్ తో చేసిన గబ్బర్ సింగ్ విజయాన్ని గుర్తు చేసేలా.. మరోసారి అభిమానులను అలరించే విధంగా చిత్రం ఉండనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్, కమాండింగ్ బాడీ లాంగ్వేజ్, మాస్ డైలాగులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మొత్తానికి చిన్న గ్లింప్స్ తో మేకర్స్ సినిమాపై అంచనాలు పెంచేశారని చెప్పాలి. ఇది కేవలం చిన్న గ్లింప్స్ మాత్రమేనని, త్వరలో విడుదలయ్యే ట్రైలర్ తో మరిన్ని హోప్స్ పెరుగుతాయని మేకర్స్ చెబుతున్నారు.ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. విడుదల తేదీ ముందుకు రావడంతో చిత్రబృందం పనులను వేగవంతం చేసింది. తాజాగా పవన్ కళ్యాణ్ డబ్బింగ్ ప్రారంభించారు. ట్రైలర్ టీజ్ కోసం ప్రత్యేకంగా ఆయనతో డబ్బింగ్ చెప్పించినట్లు తెలుస్తోంది. దేవిశ్రీప్రసాద్ పాటలు అందించగా, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ కోసం తమన్ రంగంలోకి దిగారు..

తాజాగా విడుదలైన టీజ్ లో తమన్ ఇచ్చిన బీజీఎం వినిపించింది. టైటిల్ కార్డ్ లో తమన్ స్కోర్ అని ప్రత్యేకంగా ప్రస్తావించారు. చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. పార్థిబన్, కేఎస్ రవికుమార్, రావు రమేష్, రాంకీ, కేజీఎఫ్ అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు.



సౌత్ స్టార్ కేథరిన్ త్రెసా స్టైలిష్ ఫోటోషూట్‌తో తలదాచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965